

# వైకుంఠయాత్ర

## - మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**"బుల్లెట్"** ఆశ్చర్యంగా, భయంగా చెప్పాడు శివాజీ దాన్ని చూసీ చూడగానే.

"అవును. నీమీదికి ఎవరో తుపాకి పేల్చారు. దాన్ని నీ గుండెకి గురిపెట్టారు. నీ చొక్కా జేబులోని ఈ మడత కత్తి ఆ బుల్లెట్‌కి అడ్డుపడి, అది నీ గుండెలోకి చొచ్చుకుపోకుండా కాపాడింది" వివరించాడు జరిగింది అర్థం చేసుకున్న చలపతి.

"ఎవరు పేల్చి వుంటారు?"

"ఇంకెవరు? కుమారస్వామి మనుషులే."

శివాజీ వెంటనే చుట్టూ చూసి గబగబా కారు ఎక్కి చెప్పాడు. "ఎక్కండి. విమానం బయలుదేరే టైం అయింది."

మళ్ళీ డ్రైవర్, చలపతి కారు ఎక్కిన తర్వాత కారు ముందుకి కదిలింది.

"నా గుండెమీద ఎవరో సుత్తితో కొట్టినట్లుగా ఫీలయ్యాను. ఆ దెబ్బకి కొద్దిగా ముందుకి ఒరిగాను. అంతలోనే తమాయించుకుంటుండగా నాకు స్పృహ తప్పింది" చెప్పాడు శివాజీ.

"గుడ్‌లక్! ఇంకొకసారి అదృష్టం నీ పక్షం వైపు వుంది" చెప్పాడు చలపతి.

"కాదు. బాడ్‌లక్ కుమారస్వామి వైపువుంది" నవ్వుతూ సంతోషంగా చెప్పాడు శివాజీ.

'ఆ పాకెట్ నైఫ్ జేబులో లేకుండా వుంటే..' మనసులో బాధగా మూలిగాడు చలపతి.

సరిగ్గా ఆ సమయంలో గవర్నర్ కారు వాళ్ళని దాటి వెళ్ళింది.

కారు ఎయిర్‌పోర్ట్ చేరుకుంది.

చలపతి ఎం.ఎల్.ఏ బాబాయి కాబట్టి ఎంట్రెన్స్ టిక్కెట్ కొనకుండానే విమానాశ్రయంలోకి నడిచాడు శివాజీతో.

"థాంక్ గాడ్. విమానాశ్రయంకి వచ్చాం. ఇది సేఫ్ ప్లేస్" చెప్పాడు శివాజీ.

పబ్లిక్ ఫోన్ దగ్గరకు వెళ్ళి పవన్ ఇంటికి ఫోన్ చేశాడు శివాజీ.

పవన్ రిసీవర్ ఎత్తగానే చెప్పాడు "పవన్ నేను శివాజీని."

"ఫ్లయిట్ డిలే అయిందా?" వెంటనే అడిగాడు పవన్.

"కాదు. నీకు ప్రత్యేకంగా థాంక్స్ చెబుదామని ఫోన్ చేస్తున్నాను. నా రక్షణ కోసం నువ్వు యిచ్చిన పాకెట్ నైఫ్ నిజంగా నన్ను రక్షించింది."

"ఏమైంది?" ఆత్రంగా అడిగాడు పవన్.

జరిగింది వివరించాడు శివాజీ.

"నువ్వు ఆ కత్తి యివ్వకపోతే ఈ పాటికి నా ప్రాణాలు పోయి వుండేవి. పెద్దమ్మకి కూడా ఈ విషయం చెప్పు. నువ్వు మాత్రం జాగ్రత్తగా వుండు."

"అలాగే! అయాం సో గ్లాడ్ యు ఆర్ ఎలైవ్."

"యముడికి, నాకు ఎందుకో లంకె కుదరడంలేదు. బై" నవ్వుతూ చెప్పాడు శివాజీ.

"గుడ్‌బై."'రిసీవర్ పెట్టేశాడు శివాజీ. ఈలోగా బోర్డింగ్ పాస్ తీసుకున్నాడు చలపతి. అది అతని చేతిలో వుంచి చెప్పాడు "గుడ్ లక్ మై బోయ్"

"గుడ్ బై బాబాయ్ అండ్ థాంక్స్."

భుజాన ఎయిర్ బ్యాగ్‌తో నడిచి వెళుతున్న శివాజీని చూస్తుంటే, అతని అదృష్టానికి ఎంతో ముచ్చటేసింది చలపతికి.

ఎయిర్‌పోర్టులోని వి.ఐ.పి లాంజ్‌లోకి వెళ్ళాడు చలపతి. అక్కడ వున్న గవర్నర్‌తో కొద్దిసేపు ముచ్చటించాడు. ఇద్దరికీ పూర్వ పరిచయంవుంది కాబట్టి.

రాబోయే ఎన్నికల గురించి మాట్లాడుకున్నారు ఇద్దరూ. విమానం బయలుదేరడానికి నిమిషం ముందు గవర్నర్ లేచి వెళ్ళి, కారులో విమానం దగ్గరకు చేరుకుని విమానం ఎక్కారు.

విమానం బయలుదేరింది.

కుమారస్వామి అడిగాడు తాతాచారిని.

"అంటే వాడు చావలేదన్నమాటేగా?"

"లేదు. దూరంగా సందులో జీప్ ఆపి చూశాం. గుండు దెబ్బ తిన్నవాడు లేచి నడిచి వెళ్ళి కారెక్కి కూర్చున్నాడు. వాడికి ఏమీకాలేదు."

"ఏం? గురి తప్పిందా?"

"కాదు. అక్కడ జరిగింది చూశాక నాకు అర్ధమైంది. వాడి చొక్కా జేబులోని కత్తి నేను పేల్చిన గుండుకి అడ్డు తగిలింది."

"డామిట్! డామిట్! ఏ పనీ సక్రమంగా చెయ్యవా నువ్వు?"

"వాడి చొక్కా జేబులో కత్తి వుందని, అది అడ్డు పడుతుందని నేనేమైనా కలగన్నానా?"

"మళ్ళీ ఇంకొకసారి ఆ తుపాకి ఎందుకు కాల్చలేదు?"

"సరిగ్గా ఆ సమయంలో గవర్నర్ కారు వెళుతోంది. పోలీసుల ఎస్కార్ట్ జీప్ కూడా వుంది కాబట్టి ఆ ధైర్యం చేయలేకపోయాను."

"ఛ!ఛ! వాడు ఈ పాటికి విమానంలో వుండి వుంటాడు" కుమారస్వామి దిగులుగా చెప్పాడు.

విమానంలో కూర్చున్న గవర్నర్‌కి తెలియదు. తాను ఆ సమయంలో అటు వచ్చి శివాజీ ప్రాణాలు కాపాడానని.

శివాజీ ఎయిర్ హోస్టెస్ యిచ్చిన స్నాక్స్ తిని, టీ త్రాగిన తరువాత రిలాక్స్‌డ్‌గా జేబులోనుంచి ఆ బుల్లెట్ బయటికి తీసి కొద్దిసేపు పరిశీలనగా చూశాడు.

"గుడ్!" బయటికే అనుకున్నాడు. దాన్ని మళ్ళీ జాగ్రత్తగా జేబులో వుంచుకున్నాడు.

విమానం బొంబాయిలో లాండ్ అయింది. శివాజీ బయటికి వచ్చేసరికి అతని తల్లి పావని శివాజీ కోసం ఆదుర్దాగా చూస్తోంది. "వెల్‌కం బ్యాక్ మై బోయ్" చెప్పింది.

మౌనంగా జేబులోనుంచి బుల్లెట్ తీసి నవ్వుతూ చూపించాడు, శివాజీ కొద్దిగా గర్వంగా అది బుల్లెట్ అని గ్రహించిన పావని ప్రశ్నార్థకంగా చూసింది.

"రెండు గంటల క్రితం ఇంకొకసారి నాకు చావు తప్పిందమ్మా."

"ఎలా? విస్ఫారిత నేత్రాలతో అడిగింది పావని.

"పద దారిలో టాక్సీలో చెబుతాను.

## 40

"మర్నాడు ఉదయం వెన్నెలకి ఫోన్ చేశాడు శివాజీ.

"హాయ్! ఎప్పుడొచ్చారు?" అడిగింది ఆనందంగా.

"నిన్న సాయంత్రం."

"లంచ్ అవర్‌లో మా బ్యూటీ పార్లర్ దగ్గరే వున్న ఫాస్ట్ ఫుడ్ కార్నర్‌కి వస్తే ఒక అరగంట మాట్లాడుకోవచ్చు. ఓ.కె?"

"డన్. ఎక్కడుంది అది?"

"ఈస్ట్ వెస్ట్ అంటే ఎవరయినా చెప్తారు. దాదర్ స్టేషన్ నుంచి ఫోర్ మినిట్స్ వాక్."

"వన్ – ఓ – క్లాక్?" అడిగాడు శివాజి.

"ఎస్! వన్ – ఓ – క్లాక్" ఒప్పుకుంది వెన్నెల.

కుమారస్వామి పాపారావుని పిలిచి చెప్పాడు "వెంటనే నువ్వు బొంబాయి బయలుదేరాలి."

"దేనికి?"

"చెబుతాను శ్రద్ధగా విను."

మొత్తం విన్న తర్వాత తల ఊపి పాపారావు అడిగాడు.

"బొంబాయిలో హయత్ దాదా మనకి హెల్ప్ చేస్తాడన్నమాట."

41

కామేష్‌కి మళ్ళీ స్పృహ వచ్చేసరికి మోకాళ్ళ నుంచి అరిపాదాలదాకా ఒకటే మంట గాయం కనబడటంలేదు. కాని రబ్బరు పీస్‌తో కొట్టడం వల్ల లోపల చర్మం అంతా కమిలిపోయినట్లయింది.

అతను బాధ ఓర్చుకునే స్థితి దాటిన తర్వాత చెప్పాడు.

"అవును. రాంగోపాల్‌ని చంపింది నేనే."

"నీ మిగిలిన సహచరులిద్దరూ గంటన్నర క్రితమే ఆ విషయం ఒప్పుకున్నారు. నీవు ఒప్పుకోడానికి ఇంత సమయం పట్టింది. ఇప్పుడు చెప్పు. ఎవరు నిన్ను ఆ పనికి నియమించింది?" అడిగాడు ఎస్.ఐ.

"కౌశిక్."

"కౌశిక్?" ఆశ్చర్యంగా అడిగాడు ఎస్.ఐ.

"అవును."

కౌశిక్ ఎవరో కాదు. రాంగోపాల్‌కి పిల్లని యిచ్చిన మామగారు.

"ఎందుకు?"

"ఆ వివరాలు నాకు చెప్పలేదు. నేనూ అడగలేదు."

"ఈ పనికి నీకు మొత్తం ఎంత ముట్టింది?" అడిగాడు ఎస్.ఐ.

"అరవై ఏడు వేలు నావాటా. మొత్తం తొంభై నాలుగువేలు."

ఏ.సి.పికి కబురు చేశాడు ఎస్.ఐ. ఆయన స్టేషన్‌కి వచ్చేలోగా కౌశిక్‌ని కూడా పట్టుకొచ్చారు పోలీసులు. కౌశిక్ ఎలాంటి నిర్బంధం లేకుండా జరిగింది చెప్పాడు.

"రాంగోపాల్ పరమ నీచుడు. నా కూతుర్ని ఏడిపించుకుని చంపుతున్నాడు. వ్యభిచారులను ఇంటికే తెచ్చుకుంటున్నాడు .తాగుతాడు. బతికి వుండగా వాడు విడాకులు యివ్వడు. నాకున్న ఒక్కగానొక్క కూతురు జీవితం అలా నాశనం అవుతుంటే చూస్తూ వూరుకోలేకపోయాను. ఎన్నిసార్లు బతిమాలినా రాంగోపాల్ నామాట వినలేదు. ఇక విసిగిపోయి నా కూతురి కన్నీళ్ళు చూడలేక హత్య చేయించాను."

"ఇదే నిజమైతే మరి కామేష్ గ్యాంగ్ 'పవన్ జిందాబాద్' అని ఎందుకు అరిచారు?"

"ఈ నేరం పవన్ మీదకి మళ్ళించి పోలీసులను తప్పుదారి పట్టిద్దామని. కుమారస్వామి భార్యది ప్రతీకార స్వభావమని నాకు తెలుసు. పవన్ మీద కసి తీర్చుకునేదాకా ఆవిడ నిద్రపోదు. కుమారస్వామి భార్య మాట వినేరకం. వాళ్ళు వాళ్ళూ చూసుకుంటారు. నేను సురక్షితంగా ఉంటానని ఈ పథకం వేశాను. ఇంతకీ నన్ను ఈ కేసులో నుంచి తప్పించడానికి ఎంత తీసుకుంటావు?" ఎంతో మామూలుగా ఎస్.ఐ.ని అడిగాడు కౌశిక్.

ఎస్.ఐ చిన్నగా నవ్వి చెప్పాడు.

"మా ఏ.సి.పి కాసేపట్లో వస్తారు. ఆయన్ని అడిగి చెప్తాను."

"ఏ.సి.పి దాకా ఎందుకెళ్ళింది విషయం?"

"పెద్ద తలకాయలన్నీ ఈ కేసులో ఇన్వాల్వ్ అయి వున్నాయి కాబట్టి."

"అయితే నేను నా నేరం ఒప్పుకోలేదని చెప్పు నీకు కాబట్టి చెప్పాను."

"టూ లేట్" చెప్పాడు ఆ ఆఖరి మాటలు మాత్రమే విని లోపలకి వచ్చిన ఏ.సి.పి.

ఎస్.ఐ లేచి ఆయనకి శాల్యూట్ చేశాడు.

"సరే. మళ్ళీ ఇంకొకసారి మొదటి నుంచి చెప్పు, విందాం" అడిగాడు ఏ.సి.పి.

ఎస్.ఐ లేచి ఆయనకి శాల్యూట్ చేశాడు.

"సరే. మళ్ళీ ఇంకొకసారి మొదటి నుంచి చెప్పు, విందాం" అడిగాడు ఏ.సి.పి.

కౌశిక్ నోరు మెదపలేదు. ఏ.సి.పి నడుముకి ఉన్న తోలు బెల్ట్ విప్పగానే మళ్ళీ మొదటి నుంచి చెప్పడం ప్రారంభించాడు.

## 42

ఆదిలక్ష్మమ్మ, చలపతి, పవన్ భోజనాలకి కూర్చున్నారు. గత నాలుగైదు రోజులుగా తమతోపాటు భోజనానికి కూర్చునే శివాజీ లేని వెలితి స్పష్టంగా తెలుస్తోంది వాళ్ళకి.

"ఈ పాటికి శివాజీ భోజనం అయుంటుంది" చెప్పింది ఆదిలక్ష్మమ్మ.

"ఆఫీస్‌కి లంచ్ బాక్స్ తీసుకెళతానని చెప్పాడు. ఇప్పుడు లంచ్ బ్రేక్ కాబట్టి తింటూ వుంటాడు."

"మీ భోజనం అయ్యాక కావాలంటే శివాజీ ఆఫీస్‌కి ఫోను చేసి మాట్లాడండి వదినా" సలహా ఇచ్చాడు చలపతి.

"మొత్తానికి శివాజీ మాత్రం గట్టిపిండం" చెప్పింది ఆదిలక్ష్మమ్మ.

ఆ మాటల్లో తృప్తి, విచారం, ఆనందం, అసంతృప్తి – అన్నీ సమపాళ్ళలో వున్నాయి.

"రాత్రికి నేను పాలకొల్లు వెళదామనుకుంటున్నాను. ఎలక్షన్ కేంపైన్ పనులు చాలా వున్నాయి చేయాల్సినవి" చెప్పాడు చలపతి.

ఆదిలక్ష్మమ్మ మౌనంగా తల వూపింది.

ఆ తర్వాత ఆ ముగ్గురు ఎవరి ఆలోచనలలో వాళ్ళు మౌనంగా భోజనం చేయసాగారు.

43

ఈస్ట్ వెస్ట్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కి మధ్యాహ్నం సరిగ్గా ఒకటి ఐదుకి వెళ్ళాడు శివాజీ.

అమెరికా తరచు వెళ్ళి తన బంధువుల ఇళ్ళల్లో వుండి వచ్చే నెమిచంద్ జైన్ బొంబాయిలో ఆ ఫాస్ట్ ఫుడ్ సెంటరు తెరిచాడు. నేలకి బిగించిన కుర్చీలు, మూడు వందల అరవై డిగ్రీల పరిధిలో తిరిగే సీట్లు, సెల్ఫ్ సర్వీస్, ప్లాస్టిక్ ట్రేలలో పరిచిన పేపరు నాప్‌కిన్స్‌లో సర్వ్ చేసే పదార్థాలు, అలంకరణ అన్నీ అమెరికన్ వాతావరణాన్ని గుర్తు చేస్తాయి. అక్కడ ప్లే చేసే కేసెట్లు కూడా అమెరికా నుంచి వచ్చిన లేటెస్ట్ హిట్స్.

క్రుసాంట్స్, బర్గర్, పిజ్జా, ఫ్రెంచ్ ఫ్రయిస్‌లాంటి అమెరికన్ ఐటమ్స్ తోపాటు  ఇండియన్ ఐటమ్స్, అన్ని రకాల ఫ్రైడ్ రైస్, పలావ్ రైస్ కూడా అక్కడ దొరుకుతాయి.

వెన్నెల దూరం నుంచే ఆ రెస్టారెంటు బయట వెయిట్ చేస్తున్న శివాజీని చూసి చేయి ఊపింది. బదులుగా చిరునవ్వుతో అతను కూడా చేయి వూపాడు. దగ్గరకి రాగానే ఒకరికొకరు రెండు చేతులు పెనవేసుకుని లోపలికి నడిచారు.

"హౌ ఆర్ యు?" అడిగింది వెన్నెల సీట్ కోసం చూస్తూ.

లంచ్ అవర్ రష్ మొదలవుతోంది.

"ఫైన్. అక్కడ కూర్చో, తెస్తాను."

ఒక కర్డ్ రైస్, ఒక వెజిటబుల్ పిజ్జా, రెండు బాటిల్ డ్రింక్స్ తీసుకువచ్చాడు శివాజీ.

ఇద్దరూ వాటిని షేర్ చేసుకోసాగారు.

"మొత్తానికి హైదరాబాద్ నుంచి క్షేమంగా వచ్చారన్నమాట. ఆర్ ఏ రియల్ హీరో" చెప్పింది వెన్నెల సంతోషంగా.

శివాజీ తనమీద తుపాకితో జరిగిన ఆఖరి హత్యాప్రయత్నం గురించి కూడా వివరిస్తుంటే, తినడం ఆపి ఆసక్తిగా విన్నది వెన్నెల. తనను కాపాడిన కత్తిని, బుల్లెట్‌ని జేబులో నుంచి తీసి చూపించాడు.

"గుడ్! మీ ఎడ్వెంచర్స్ గుర్తుగా ఈ రెండూ అందరికీ కనపడేలా మీ డ్రాయింగ్ హాల్లో షోకేస్‌లో వుంచాలి వీటిని."

"మీ కాదు. మన డ్రాయింగ్ హాల్లో. వి ఆర్ ఇన్ లవ్. వైనాట్ వి గెట్ మేరీడ్?" అడిగాడతను.

"అఫ్‌కోర్స్! వైనాట్?"

ఆ తర్వాత ఇద్దరు తమ పెళ్ళి ఏర్పాట్ల గురించి మాట్లాడుకోసాగారు రిసెప్షన్ ఎక్కడ జరగాలి, అందరినీ పెళ్ళికే పిలవాలా, లేక పెళ్ళి సింపుల్‌గా చేసుకుని రిసెప్షన్ గ్రాండ్‌గా ఏర్పాటు చేసి, అక్కడ వీడియోలో తమ పెళ్ళి క్యాసెట్‌ను ప్రదర్శించాలా? మెనూలో ఏమేమి వుండాలి మొదలైన విషయాలు.

ఆ సంభాషణ వాళ్ళకి ఎంత ఎగ్జైటింగ్‌గా ఉందంటే, వెన్నెల టైం కూడా చూసుకోలేదు. ఇరవై నిమిషాలు లేటుగా వెళ్ళింది బ్యూటీపార్లర్‌కి. ముగ్గురు రెగ్యులర్ కస్టమర్లు ఆమెకోసం ఎదురు చూస్తున్నారు.

"ఎందుకు లేటైంది?" అడిగింది పార్లర్ యజమానురాలు ఆసక్తిగా.

"నా కాబోయే భర్తతో నా పెళ్ళి ఏర్పాట్లు గురించి మాట్లాడుతుంటే" అని చెప్పడానికి సిగ్గు అడ్డురావడంతో అబద్ధం ఆడింది – "టీవీలో  ఏ ఛానల్‌లోనూ లేదు. పెళ్ళి చేసుకోబోతున్నావు. కాస్తంత అబద్ధాలు ఆడటం నేర్చుకో. మీ వెనకే కూర్చున్నాను. కొంత విన్నాను. అతన్ని చూశాను. గుడ్ ఛాయిస్. కంగ్రాచ్యులేషన్స్" నవ్వుతూ విష్ చేసింది పార్లర్ యజమానురాలు.

వెన్నెల సిగ్గుపడింది.

44

కుమారస్వామి ఇంటికి తిరిగి రాగానే అతని భార్య చెప్పింది.

"మిమ్మల్ని అర్జెంటుగా పోలీస్ స్టేషన్‌కి రమ్మని నాలుగుసార్లు ఫోను వచ్చింది."

"దేనికట?"

"మా రాంగోపాల్ హత్య విషయంలో కొత్త సంగతులు తెలిశాయని చెప్పమన్నాడు సి.ఐ. ఒకసారి వెళ్ళి రండి. పవన్ మీద వెంటనే చార్జ్‌షీట్ దాఖలు చేసే ప్రయత్నం చూడండి.

"అలాగే."

అరగంట తర్వాత కుమారస్వామి పోలీస్ స్టేషన్‌కి చేరుకున్నాడు. ఏ.సి.పి జరిగింది వివరిస్తే పాలిపోయిన మొహంతో మొత్తం విన్నాడు.

కౌశిక్ దగ్గరకు వెళ్ళి "నిజమేనా?" అడిగాడు కుమారస్వామి.

ఆయన తల ఊపి, వెంటనే తలదించుకున్నాడు.

"నాతో చెపితే నేను దారిలో పెట్టేవాడినిగా? చంపటం దేనికి? కనీసం విడాకులు ఇప్పించేవాడినిగా?" అడిగాడు కుమారస్వామి.

"విడాకులు పుచ్చుకున్న వాళ్ళకంటే, విడోలకి తొందరగా మళ్ళీ పెళ్ళి అవుతుందని. విడాకులంటే ఆడవాళ్ళ తప్పే అనుకుంటుంది మాయదారి లోకం" చెప్పాడు కౌశిక్.

కుమారస్వామి పోలీస్ స్టేషన్ నుంచి ఇంటికి తిరిగి వెళుతూ దారిలో పాపారావు ఇంటిదగ్గర ఆగాడు, బొంబాయి వెళ్ళాల్సిన అవసరం లేదని చెప్పడానికి.

"ఆయన బయలుదేరారు. ముందు షిరిడీ వెళ్ళి అక్కడినుండి బొంబాయి వెళతానని మా అబ్బాయితో చెప్పారు" చెప్పింది పాపారావు భార్య.

"అరెరె! నీకు ఫోను గనుక వస్తే బొంబాయిలో పనేమీ లేదని, వెంటనే బాయలుదేరి రమ్మన్నానని, అక్కడి పని కేన్సిల్ అయిందని చెప్పు."

"ఆయన నాకు ఫోన్ చెయ్యరు."

"ఒకవేళ చేస్తేనే"

"చేయరు. మా ఇద్దరికి మాటల్లేవు."

"ఫోన్ మీ అబ్బాయికి చేస్తే ఆ ముక్క చెప్పమను."

"మా అబ్బాయికి చేయరు. వాడి వయసు నాలుగు నెలలు" జవాబు చెప్పింది పాపారావు భార్య.

(ముగింపు వచ్చే సంచికలో)

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in